క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా సభ

ప్రొద్దుటూరు : స్థానిక హౌసింగ్ బోర్డులోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సభను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరవుతారని వారు పేర్కొన్నారు.

రక్తదానం చేసిన ఆర్‌ఐ

పోరుమామిళ్ల : సాటి మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలుసుకొన్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సింధూజ రక్తదానం చేసింది. బి.మఠం మండలం వెంకటాపురానికి చెందిన గర్భిణీ వెంకటసుబ్బమ్మ మూడు రోజుల క్రితం స్థానిక ఆసుపత్రిలో ప్రసవానికి చేరింది. గర్భిణీకి ఓ నెగటివ్ రక్తం అవసరముండటంతో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. వారు ఆర్‌ఐని సంప్రదించగా రక్తదానం చేసేందుకు ముందుకువచ్చారు. పలువురు ఆర్‌ఐ సింధూజను అభినందించారు.

రేపు అయ్యవారిపల్లెలో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయ భవనం వద్ద ఏర్పాటు చేసే శిబిరంలో అయ్యవారిపల్లె పరిధిలోని ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వైద్య పరీక్షలు చేసి, అనంతరం గృహ సందర్శనలో భాగంగా ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులను పరీక్షించి వైద్యం అందిస్తామని చెప్పారు.

ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లకు భూమి పూజ

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో రూ.1.24 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు రూ.1.24 కోట్లతో కాలనీలో 12 వీధుల్లో సీసీ రోడ్లు వేయనున్నారు. భూమి పూజ అనంతరం తెలుగుగంగ కాలనీలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మున్సిపల్ పరిపాలనా భవనాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వార్డు కౌన్సిలర్ గౌసియా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, షాషా, షౌకత్, ఖాదర్, కమిషనర్ రాముడు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

బద్వేలు అర్బన్ : పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తుండే డాక్టర్ అచ్చెన్నను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యురాలు పి.ఎం.కమలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం, న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ దళితులకు న్యాయం జరగడం లేదనడానికి అచ్చెన్న ఘటనే నిదర్శనమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని ఆమె పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. చైత్రమాసం రెండవ శనివారం సందర్భంగా వేకువజాము నుండి స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సీఎం జగన్‌పై బీజేపీ నాయకుల విమర్శలు దారుణం

కడప కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై బీజేపీ నాయకులు సత్యకుమార్, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వాఖ్యలు దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 260 మంది రైతులను ప్రభుత్వమే బలి తీసుకుందని చెప్పడం సరికాదన్నారు. అమరావతి ప్రాంతాన్ని తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వేదికగా చేసుకొని మిగిలిన ప్రాంతాలను అప్పటి సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేశారని, తద్వారా ఆ ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత తన మనుగడ కోసం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు అమరావతి రైతుల ముసుగులో బినామీలను ఉసిగొల్పి వారిని బలి తీసుకున్నది చంద్రబాబేనన్నారు.

బండలాగుడు పోటీలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఏరువాక గంగమ్మతల్లి గంగజాతర సందర్భంగా పోటీలు నిర్వహించారు. అలాగే గంగమ్మజాతరలో జమ్మలమడుగు శాసనసభ్యుడు డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మూలే హర్షవర్ధన్‌రెడ్డి, ఎర్రగుంట్ల మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

మహిళల ఆర్థిక వృద్ధే సీఎం ధ్యేయం

రూ.6.1 కోట్ల చెక్కును అందించిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : మహిళల ఆర్థిక వృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులోని సీవీవీ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత డ్వాక్రా మహిళలు రూ.6.1 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని మోసం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్పయాత్రలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చేతున్నారని పేర్కొన్నారు. దువ్వూరు మండలంలో 881 డ్వాక్రా సంఘాలకు మూడో విడత రూ.6.1 కోట్లు మంజూరైందన్నారు. ఇప్పటికి మూడు విడతల్లో రూ.18.21 కోట్లు డ్వాక్రా మహిళలకు అందించామని వివరించారు. కరోనా కష్టకాలంలో కూడా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. 45 ఏళ్లు నిండిన మహిళలకు రూ.18,750, ఈబీసీ నేస్తం కింద ఓసీ మహిళలకు రూ.15వేలు సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఇప్పటికి రూ.14,129 కోట్లు మహిళలకు ప్రభుత్వం అందించిందన్నారు. అమ్మ ఒడి ద్వారా ఏడాదికి విద్యార్థులకు రూ.15వేలు వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని,చిక్కీలు, రాగి జావ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. పేద పిల్లలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల డబ్బు విద్యార్థుల తల్లుల ఖాతాలకే జమ చస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడు కింద నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషుమీడియం అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో మరో సారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక బలంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ముందుగా దువ్వూరు సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి కల్యాణ మండపం వరకు డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సర్పంచ్ దండు చెంద్రాయుడు, మండల సచివాలయ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ చిరాకి బాషా, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ లావణ్య, ఏపీఎం శ్రీధర్, యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్



రాజుపాళెంలో మూడవ విడత ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : ఎన్నికలకు ముందు జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ఆయన పాలనపై నమ్మకం ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా సంఘాలకు మెగా చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు చెప్పిన మేరకు తీసుకున్న రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేశామన్నారు. అదే చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా పసుపు, కుంకుమ పేరుతో చేతులు దులుపుకున్నాడన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న జగనన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. రాజుపాళెం మండలంలో 504 డ్వాక్రా సంఘాలకు 5043 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద మూడో విడతలో రూ.2,69,38,773 కోట్లు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఎంపీపీ సావిత్రి సలోమి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, ఏపీఎం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొదలైన ఆదిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 10 రోజుల పాటు జరుగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి విశ్వక్సేన పూజ, మూలమూర్తులకు రక్షాబంధనము, గరుడ ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయాకర్పూరం సమర్పించి పూజలు జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వాకమళ్ల రంగారెడ్డి, ధర్మకర్తలు రంగారెడ్డి, వసుంధరమ్మ, శివరామిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటసుబ్బమ్మ, అర్చకుడు రమేష్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవం.. సీతారాముల గ్రామోత్సవం



గరుత్మంతుడి వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

రాజుపాళెం : శ్రీరామనవమి పండుగ సందర్భంగా రాజుపాళెంలో గరుత్మంతుడి వాహనంపై సీతారాముల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త సుంకు రామకృష్ణయ్య, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు ప్రారంభమై శనివారం తెల్లవారుజామున 6.30 గంటలకు ముగిసింది. తొలుత అర్చకుడు నాగేంద్రశర్మ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

అట్లూరు : మండల పరిధిలోని వేములూరులోని రామాలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి నుంచి మూడవ రోజు అయిన శనివారం చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి ఆలయ కమిటీ, గ్రామస్తులు వేద పండితులచే కల్యాణం జరిపించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానంతోపాటు కోలాటం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని శ్రీరాములపేట సెక్టార్‌కు సంబంధించి శనివారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ హైమావతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్షుమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు రాణి, శ్రీవాణి, పద్మావతి, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రూరల్ ప్రాజెక్టు పరిధిలోని నడింపల్లె స్లాటర్ హౌస్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై ర్యాలీ నిర్వహించిన అనంతరం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణ కుమారి, సూపర్‌వైజర్లు శంషాద్, శారదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, జయలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

కాశినాయన : చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రత్యూష తెలిపారు. శనివారం మండలంలోని ఆకులనారాయణపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ పోషకాహారానికి అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. గర్భిణీలు, తల్లులు చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, పెసలు, కొర్రలు, మినుమలతో చేసిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలపై పిల్లలు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త తులశమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నో స్కూల్ బ్యాగ్ డేతో మానసిక ఉల్లాసం



ఆట వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చాపాడు : ప్రభుత్వం ఇటీవల పాఠశాలల్లో ప్రవేశపెట్టిన నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని హెడ్‌టీచర్ జవహర్ మున్నీర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆట వస్తువులను తయారు చేయించటం నేర్పించామన్నారు. వీటితో పాటు విద్యార్థులు పాటలు, ఆటల పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి నెలా మొదటి, మూడవ శనివారం క్రమం తప్పకుండా నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలి



టీకాల చార్టును పరిశీలిస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : వ్యాధి నిరోధక టీకాలను పిల్లలకు తప్పక ఇప్పించాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని నక్కలదిన్నె, గోపవరం, కొత్తపేట, చౌటపల్లె సచివాలయాల్లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం 100 శాతం పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య, ఆశా, అంగన్ వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



సామగ్రి అందజేస్తున్న రవి

పోరుమామిళ్ల : మండలంలోని కవలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ చెరుకూరి రవికుమార్ సహకారంతో మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో పరీక్షలు మొదలవుతున్నందున విద్యార్థులు ఏకాగ్రతతో, పట్టుదలతో చదవాలని, పరీక్షలయ్యేంత వరకు పుస్తకాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, బబ్లు, జనార్ధన్, శ్రీను పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినులకు శనివారం ఎంబీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సహకారంతో పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గోపవరం మండల విద్యాశాఖాధికారి చెన్నయ్య, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రవిశంకర్‌లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పరీక్షల్లో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుజాత, సీఆర్‌పీ రమణయ్య, ఉపాధ్యాయులు నీరజ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలసపాడులోని అంకాలమ్మ పరమేశ్వరీ లేఅవుట్‌లో వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలో 596 గ్రూపులకు రూ.4,17,46,262లు మెగా చెక్కును ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల చేతులమీదుగా డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో గెలవాలనే దురాశతో చంద్రబాబు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని, ఎవరూ బ్యాంకులలో డబ్బులు కట్టవద్దని ప్రకటించారని, చంద్రబాబు మాటలను నమ్మిన మహిళలు రుణాలు కట్టకపోగా వడ్డీలు పెరిగి ఖాతాలు బ్లాక్‌లో పడ్డాయన్నారు. చంద్రబాబు నైజాన్ని పసిగట్టిన మహిళలు 2019 ఎన్నికల్లో బుద్ధి చెప్పారని తెలిపారు. జగనన్న సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలు తెలుసుకుని ముఖ్యమంత్రి కాగానే నాలుగు విడతల్లో ఆర్థిక సాయం చేసేలా వైఎస్సార్ ఆసరా ద్వారా వారిని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. మహిళలంతా జగన్మోహన్‌రెడ్డి ఆదరించి మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, బద్వేలు వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ బి.వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ గురివిరెడ్డి, ఎంపీపీ నిర్మల, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుదర్శన్, సింగిల్‌విండో మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసులరెడ్డి, శివలీల, ఎంపీటీసీ కుర్షీద్‌బేగం, సింగరయ్య, తహసీల్దారు రవిశంకర్, ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఏపీఎం నాయుడు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఈఈ కార్యాలయం ఏర్పాటు శుభపరిణామం

బద్వేలు అర్బన్ : బద్వేలు కేంద్రంగా పంచాయతీ రాజ్ ఈఈ కార్యాలయం ఏర్పాటు శుభపరిణామమని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఈఈ కార్యాలయాన్ని శనివారం పంచాయతీరాజ్ ఈఈ ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలుకు రెవెన్యూ డివిజన్ హోదా కల్పించిన నేపథ్యంలో రూ.25 లక్షల వ్యయంతో ఈఈ కార్యాలయం విస్తరణ, నూతన ఈఈ కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ, డీఈ సూర్యనారాయణరెడ్డి, అమర్‌నాథ్, మల్లేశ్వర్‌రెడ్డి, ఆయా మండలాల ఏఈలతో పాటు ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పక్కాగా చేపట్టాలి

ఈ నెల 7 నుంచి ప్రారంభంకానున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పక్కాగా చేపట్టాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శనివారం నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గంలోని 7 మండలాల కన్వీనర్లు, మండల సచివాలయ కన్వీనర్లు, మున్సిపాలిటీ ముఖ్య నాయకులతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ నిర్వహణపై నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుండి పంపిన ప్రచార సామాగ్రిని ఆయా సచివాలయాల కన్వీనర్లు గృహసారథులకు పంపిణీ చేయాలని సూచించారు.

5 నుంచి మహిళలకు యోగా శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీకళాశాలలో ఈ నెల 5వ తేదీ నుంచి 45 రోజుల పాటు మహిళలకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్కృతి, స్వస్థ, వివేకానంద యోగా కేంద్రాల ప్రతినిధులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, తిరుపాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ యోగా గురువులు మనోహర్, మునిశేఖర్ గురూజీ ఆధ్వర్యంలో యోగ తరగతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు శ్రీ రాములపేటలోని ఉపాధ్యాయ సేవాకేంద్రంలో కాని, సెల్ నంబర్ 6303075913కు సంప్రదించాలని కోరారు.

సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు : కళాశాలలో గత నెలలో ఎంపసిస్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీ చైర్మన్ వి.జయచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనలియర్ సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాయరు. వీరికి సంవత్సర ఆదాయం రూ.3.20 లక్షలు కంపెనీ నిర్ణయించిందని చైర్మన్ తెలిపారు.

శ్రీరామకోటి పుస్తకాల విడుదల

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పరిధిలో ఉన్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు స్థానిక సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీరామకోటి పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా రామకోటి పుస్తకాలను ప్రగతి శ్రీనివాసులు, బయన నాగేంద్రరెడ్డి, తాటసాని వెంకటరెడ్డి, కాకర్ల బాలుడు, తులసిసురేష్, సిద్ధమూర్తి రాజారెడ్డి తదితరులు ప్రచురించారని, రామకోటి రాయదలచిన భక్తులకు వీటిని అందజేస్తున్నామన్నారు. రెడ్డినగర్‌లోని కోదండరామాలయం, లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో అందుబాటులో ఉన్నాయని, భక్తులు వీటిని తీసుకుని రామకోటి రాసి మే 30వ తేదీలోపు అందజేస్తే భద్రాచలం శ్రీరాముని సన్నిధికి పంపుతామని ఆయన తెలిపారు.

నోట్లరద్దు ముసుగులో ప్రైవేటీకరణ

కమలాపురం : బీజేపీ నగదీకరణ ముసుగులో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ విశాఖలో నిరసన దీక్షలు చేపట్టి 700 రోజులు పూర్తి అయిన నేపథ్యంలో శనివారం కమలాపురంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆధునికీకరణ పనులు

గోపవరం : తహసీల్దారు కార్యాలయానికి ఆధునికీకరణ పనులు చేపట్టారు. మండల వ్యవస్థ ఏర్పడినప్పుడు నిర్మించిన భవనం కావడంతో క్రమేనా శిథిలావస్థకు చేరుకుంది. కొద్దిపాటి వర్షం పడినా తడిసి ముద్దవుతుంది. సిబ్బంది పనిచేస్తున్న గది అయితే పెచ్చులూడి పడుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళనకు గురయ్యేవారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి తహసీల్దార్లు అనేకమార్లు భవనం దుస్థితిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం పాత భవనాలకు ఆధునికీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో బద్వేలు ఆర్డీఓ ఆకులవెంకటరమణ ఆదేశాల మేరకు పనులు చేపట్టారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి పర్యవేక్షణలో ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తహసీల్దారు కార్యాలయంలో పనులు జరుగుతున్నందున విధి నిర్వహణ పక్కనే ఉన్న వ్యవసాయ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తహసీల్దారు దామోదర్‌రెడ్డి తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం రామాంజనేయపురంలోని ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, ఆత్మ విశ్వాసం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివే బదులు ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీఓ రజనీకాంతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ



పాఠశాల హెచ్‌ఎం, పీడీకి క్రీడాసామగ్రి అందజేస్తున్న శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ఆర్‌ఎం

కడప స్పోర్ట్స్/చెన్నూరు : చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడావిభాగానికి రూ.1.25 లక్షల విలువచేసే క్రీడా సామగ్రిని వితరణగా అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ సంస్థ రీజినల్ మేనేజర్ గిరిధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాఠశాల హెచ్‌ఎం ఓ.రఘునాథరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కె. రెడ్డయ్యకు క్రీడాసామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘునాథరెడ్డి, పీడీ రెడ్డయ్యలు మాట్లాడుతూ 40 జతల క్రీడాదుస్తులు, వాలీబాల్ నెట్స్, ఐరన్‌పోల్స్, నెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్ కిట్, వెయిట్‌లిఫ్టింగ్, కోలాటం తదితర సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం తనిఖీ

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దుళ్లపల్లెలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్‌లు ఎస్.వినీత్‌కుమార్‌రాజు, యు.ఉదయ్‌కిరణ్ వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గర్భిణులను, బాలింతలను పరీక్షించారు. అలాగే పాయలకుంట్ల, బి.కోడూరు గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం బి.కోడూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు.